క్లుప్తంగా

సాగు ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ



మహిళా రైతుకు కొర్రలను అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: చిరుధాన్యాల సాగుకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా వస్తుందని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ జాన్సన్ పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగుపై స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. కో ఆర్డినేటర్‌తో పాటు వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీఏ సత్యనారాయణలు మాట్లాడారు. రైతులు చిరుధాన్యాల సాగు అర ఎకరం నుంచి ఎకరం వరకు విస్తీర్ణం పెంచుకుంటే మంచి ఆదాయం వస్తుందన్నారు. 70 లేదా 80 రోజుల్లోనే పంట చేతికి వస్తుందన్నారు. చీడపీడల సమస్య అంతగా ఉండదని చెప్పారు. చిరుధాన్యాలకు మంచి మార్కెటింగ్ ఉందన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుతో ఆదాయంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం పలువురు రైతులు సాగు చేసేందుకు చిరుధాన్యాలను అందజేశారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన



గ్రామస్తులకు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గురించి వివరిస్తున్న సీహెచ్ఓ హేమలత

తాడిమర్రి: సీహెచ్ఓ హేమలత శనివారం మద్దులచెర్వు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, జబ్బు పడిన వారికి బీపీ, షుగర్, రక్తం, మూత్ర తదితర పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ హేమలత మాట్లాడుతూ ప్రజలు వైద్య చికిత్సల కోసం మండల కేంద్రానికి లేదా విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లకుండా ఇళ్ల వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. తల్లిదండ్రుల ద్వారా జన్యుపరంగా సంక్రమించే సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన పెంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ముంగిన్ తాజ్ పాల్గొన్నారు.

రేపు వారపు సంత వేలం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లిలో వారం సంత నిర్వహణకు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంగ్లీ బాయి ఆధర్యంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పకడ్బందీగా 'నేను బడికి పోతా'



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

గాండ్లపెంట: నేను బడికి పోతా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శనివారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలుపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి వారిని పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, షూ, దుస్తులు ఉచితంగా అందజేస్తోందని తెలియజేయాలన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లి, నార్పింపల్లి గ్రామాల్లో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి మూల విరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పూలమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిమర్రి, నిడిగల్లు గ్రామాల్లోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల్లో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయా ఆలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వ్యాధుల సీజన్.. జనం పరేషాన్

- ఈగలు, దోమలతో ప్రబలుతున్న రోగాలు
- విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు, అతిసారం
- రోగులతో ఆస్పత్రులు కిటకిట
- పరిసరాల శుభ్రత అత్యవసరం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు





ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అతిసారం, వైరల్ జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

ధర్మవరం అర్బన్: వర్షాకాలంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. నెల రోజులుగా సీజనల్ వ్యాధులు చుట్టుముట్టి ప్రజలను మంచాన పడేస్తున్నాయి. అతిసార, వైరల్, టైఫాయిడ్, జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. వ్యాధులతో ప్రజలు ఆస్పత్రు పాలవుతున్నారు. రోగులతో ధర్మవరం ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ఇదిలా ఉండగా చేపలు, మాంసాహారం, అపరిశుభ్ర వాతావరణంలో వీధుల్లో విక్రయించే తినుబండారాలతో ఎక్కువగా అతిసార వ్యాధి వస్తుందని, బాధితులకు విపరీతంగా వాంతులు, విరేచనాలు అతిగా ఉండటంవల్ల శరీరంలో నీటి శాతం బాగా తగ్గి బలహీనంగా తయారవుతారని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

ఈగలతో టైఫాయిడ్ జ్వరాలు

ఇళ్ల చుట్టూ నీరు నిలబడటం, మురుగు గుంతల వల్ల ఈగలు ఎక్కువగా పుట్టుకొస్తాయి. వీటివల్ల బ్యాక్టీరియా మనపై వచ్చి చేరుతుంది. దీంతో జ్వరం వచ్చి టైఫాయిడ్‌గా మారుతుంది. తరచూ జ్వరం వస్తుంటే రక్త పరీక్ష చేయించి వైద్యుని సలహా మేరకు మందులు వాడుకోవాలి.

దోమలతో మలేరియా, చికున్‌గున్యా, డెంగీ..

దోమకాటు వల్ల మలేరియా, చికున్‌గున్యా వ్యాప్తి చెందుతాయి. ఎనాఫిలిస్ దోమలవల్ల మలేరియా వస్తుంది. తరచూ జ్వరం, తలనొప్పి, చలి జ్వరం వేధిస్తుంటే చికున్‌గున్యా సోకినట్టు సంకేతం. ఇక పగటి పూట కుట్టే ఎడిస్ ఈజిప్టి అనే దోమతో డెంగీ వస్తుంది. మోచేతులు, మోకాళ్లపైనా ఈ దోమలు ఎక్కువగా కుడుతుంటాయి. ఒళ్లంతా దద్దుర్లు వచ్చి, తెల్ల రక్తకణాలు తగ్గి నీరసించిపోతారు.

పారిశుద్ధ్య లోపంతో హెపటైటిస్...

సీజనల్ వ్యాధుల్లో హెపటైటిస్ ఒకటి పారిశుద్ధ్య లోపంవల్లే ఈ వ్యాధి సోకుతుంది. కాలేయ సంబంధిత ఇబ్బందులు ఏర్పడి పచ్చ కామెర్లు వస్తాయి. కళ్లు, చర్మం పచ్చబడటం ఈ వ్యాధి లక్షణాలు. వైద్యం పొందుతూ, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు చెబుతున్నారు.

ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ఆస్పత్రుల్లో నెలరోజులుగా జ్వరాలు, అతిసారం, ఇతరత్రా వ్యాధులతో నమోదైన కేసులు

మండలాలు	అతిసార	టైఫాయిడ్	మలేరియా	చికున్‌గున్యా	డెంగీ	కామెర్లు
ధర్మవరంటౌన్	98	53	28	24	03	20
ధర్మవరంరూరల్	45	14	21	17	02	12
బత్తలపల్లి	31	16	08	08	03	05
తాడిమర్రి	25	16	21	18	02	03
ముదిగుబ్బ	45	12	15	22	02	18

కలుషిత నీరు, ఆహార పదార్థాలతో జాగ్రత్త



వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. వాతావరణ మార్పుల వల్ల పట్టణంతోపాటు గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. కలుషిత తాగునీరు, దోమలు, ఈగల ద్వారా అతిసారం, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సులువుగా వ్యాప్తి చెందుతున్నాయి. రక్తకణాలు తగ్గిపోవడంతో పలువురు మంచాన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసరాల శుభ్రత, ఆహార నియమాలు పాటించటంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముందస్తు వైద్య పరీక్షల ద్వారా రక్షణ పొందాలి. ఆరోగ్యంపై ఏమాత్రం అశ్రద్ధ వహించకండి.

– డాక్టర్ నజీర్, ప్రభుత్వ వైద్యుడు, ధర్మవరం

శేషంపల్లిలో చోరీ

- రూ.10 లక్షల నగదు, 3 తులాల బంగారు ఆభరణాల అపహరణ
- బంధువులే దోపిడీ చేశారని బాధితుడి ఫిర్యాదు



బీరువాను తెరిచిన దృశ్యం

రామగిరి: భార్య తరపు బంధువులే తన ఇంట్లో దూరి రూ.10 లక్షల నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారని రామగిరి మండలం శేషంపల్లి గ్రామానికి చెందిన నరసింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం సత్యసాయినగర్‌కు చెందిన నాగేంద్రమ్మతో శేషంపల్లికి చెందిన నరసింహకు వివాహమైంది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో శనివారం నరసింహ ఇంట్లోలేని సమయంలో భార్య తరపు బంధువులు శ్రీలక్ష్మి, తిమ్మయ్య, మౌనిక, శ్రీనివాసులు, నాగమణి, శ్రీలక్ష్మి, రామాంజినేయులు తదితరులు ఆటోలో శేషంపల్లికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ. 10 లక్షల నగదు, 3 తులాల బంగారు నగలు తీసుకున్నారు. అనంతరం ఇంట్లోని సామగ్రిని వీధిలో పారేసి వెళ్లిపోయారు. తర్వాత ఇంటికి వచ్చి చూసుకున్న నరసింహ.. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



కాడెద్దులతో సేద్యం పనులు ప్రారంభిస్తున్న రైతులు

నల్లమాడ: మండలంలోని కొండకింద తండాలో వైఎస్సార్ సీపీ సర్పంచ్ పార్వతీబాయి, నాయకుడు మంగేనాయక్ ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. తండా సమీపంలోని భూమిలో కాడెద్దులకు పూజలు నిర్వహించి సేద్యం పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గతంలో ఏరువాక పౌర్ణమికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఆరోజుల్లో రైతులు భూమిని తల్లిగా భావించి పొలాల్లో పూజలు నిర్వహించి పంటసాగు పనులు ప్రారంభించేవారన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోవడంతో ఆ సంప్రదాయం కనుమరుగైందన్నారు. రసాయన ఎరువుల వాడకం పెరిగిపోవడంతో భూమిలో సారం నశించి పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడమే గాక ప్రజల్లో అనారోగ్య సమస్యలు అధికం అయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి, నాయకులు మురళీధర్, హనుమంతరెడ్డి, అంజనేయులు, తండావాసులు పాల్గొన్నారు.





ఉప్పరవాండ్ల కొట్టాల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టు (ఫైల్), చెట్టును తొలగించిన దృశ్యం

ఎండిన చెట్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఎస్ఎస్ గేట్ నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో ఉప్పరవాండ్ల కొట్టాల వద్ద 'ప్రమాదకరంగా చెట్టు' శీర్షికతో ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉప్పరవాండ్ల కొట్టాల బస్టాప్ వద్ద ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టున శనివారం అధికారులు తొలగింపజేశారు. ప్రమాదం జరగకముందే చెట్టును తొలగించడంతో పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాహనం బోల్తా

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై పెద్దనపల్లి క్రాస్ వద్ద శనివారం ఐచర్ వాహనం బోల్తా పడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపునకు రాయి పౌడర్ తీసుకొని వెళ్తుండగా పెద్దనపల్లి క్రాస్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆంజనేయస్వామికి పూజలు



అన్నదానం చేసిన వార్డెన్ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

నల్లచెరువు: పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నల్లచెరువు బీసీ హాస్టల్ వార్డెన్ కుంచపు లక్ష్మీనారాయణ, సాలెమ్మ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

డీఈఓ వైఖరిపై నిరసన



డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కొత్తచెరువు: డీఈఓ వైఖరిని నిరసిస్తూ కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయాన్ని శనివారం అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ముట్టడించాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల 21న యోగాడే సందర్భంగా కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చిన డీఈఓ మీనాక్షి తనకు సరైన గౌరవం ఇవ్వలేదని నెపంతో యోగా కార్యక్రమం సక్రమంగా నిర్వహించలేదని పాఠశాల పీడీ జానకిని సస్పెండ్ చేశారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. సస్పెండ్ అయిన పీడీ జానకిని నాలుగు రోజుల్లో విధుల్లోకి తీసుకోవాలని, ప్రధానోపాధ్యాయురాలిపై షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నా నిర్వహిస్తామన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



సూచనలు ఇస్తున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని హరియాన్ చెరువు గ్రామంలో 104 సంచార వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మందులను క్రమం తప్పక వాడాలని డాక్టర్లు సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు చేరి నిల్వ ఉంటే అందులో దోమలు పెరిగి జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. అలాగే ఇళ్ల వద్ద మురికినీటి గుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్ఎం అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసన్నకుమార్ నాయుడు ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని దామాజిపల్లి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలు అందరికీ అందాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలను జాగ్రత్తగా ఉపయోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలై 3న బహిరంగ వేలం

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద ఏడాది పాటు వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు జూలై 3న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రవీంద్రరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.30 వేల డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

ఘనంగా ప్రాకారోత్సవం

హిందూపురం టౌన్: పట్టణంలో వెలసిన పేట వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించి ప్రాకారోత్సవం జరిపారు. తొలుత ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పంటల సాగుకు శ్రీకారం

- ఆముదం, కంది పంటలపై రైతన్నల ఆసక్తి
- ఏరువాక పౌర్ణమి సందర్భంగా విత్తన సాగు పనులు ప్రారంభం



విత్తనశుద్ధి చేస్తున్న రైతులు



ఎద్దులకు పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న రైతు

ఆత్మకూరు: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఇటీవల విస్తారంగా వర్షాలు కురిశాయి. పొలాల్లో సేద్యం పనులు పూర్తి చేసుకున్న రైతన్నలు విత్తన సాగుకు సిద్ధమయ్యారు. శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండల వ్యాప్తంగా చాలా మంది రైతులు తమ పొలాల్లో పంటలు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ఉదయాన్నే పొలాలకు వెళ్లి ఎద్దులకు పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి విత్తన సాగు పనులు మొదలు పెట్టారు. మండలంలో బోరు బావుల కింద కాకుండా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతోందని చెప్పవచ్చు. మండలంలో దాదాపు 50 వేల ఎకరాల వరకు సాగు భూమి ఉంది. గతంలో ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేసేవారు. మండల వ్యాప్తంగా వేరుశనగ 35 వేల ఎకరాలు, కందులు 4 వేల ఎకరాలు, 15 వేల ఎకరాలకు పైగా ఆముదం పంటలు సాగయ్యేవి. ప్రస్తుతం వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. చాలా మంది ఆముదం, కంది పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, కొర్ర, సజ్జ, పత్తి వంటి పంటలపై ఆసక్తి చూపుతున్నారు. వారం రోజులుగా వరుణుడు తెరిపి ఇవ్వడంతో ఎండకు తేమ తగ్గింది. విత్తన సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు చాలా మంది విత్తనాలు ముందుగానే సాగు చేస్తున్నారు.

పెరిగిన బాడుగలు..

ప్రస్తుతం ఎద్దులతో వ్యవసాయ పనులు చేయడం చాలా వరకు తగ్గిపోయింది. గతంలో ప్రతి ఇంట్లో రెండు జతల ఎద్దులు ఉండేవి. ప్రస్తుతం చాలా చోట్ల వీధికి ఒక జత ఎద్దులు కూడా కనిపించకుండా పోయాయి. యంత్రాలతో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ట్రిల్లర్, దున్నిన భూమిని గుంటుకతో పాయడం, మళ్లీ విత్తనాలు విత్తడం ఇలా ఎద్దుల కన్నా ట్రాక్టర్‌ల ద్వారానే ఎక్కువగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. గంటకు ట్రాక్టర్ బాడుగ ఒక్కో రకం వ్యవసాయ పనికి ఒక్కో ధరను ట్రాక్టర్ యజమానులు తీసుకుంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి. విచ్చలవిడిగా రసాయన మందులు, పురుగు నివారణ మందులు వినియోగించరాదు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రసాయన, పురుగు మందులను వినియోగించాలి. జూలై నెలాఖరు వరకూ విత్తన సాగుకు అవకాశం ఉంది. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 2,850 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశారు. రాయితీపై కందులు కూడా అందజేస్తాం. ఆసక్తి ఉన్న రైతులు విత్తనాలు తీసుకెళ్లాలి.

– సుచరిత, ఏఓ

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



సూర్యనారాయణ రెడ్డి (ఫైల్)

నల్లచెరువు: మండలంలోని గొర్లవాండ్లపల్లికి చెందిన రొద్దం సూర్య నారాయణరెడ్డి అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు కుమార్తె సుమతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈయన కొంతకాలంగా నల్లచెరువు మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలోని కుమార్తె సుమతి ఇంట్లో నివాస ముంటున్నాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. తిరిగి రాకపోవడంతో కుమార్తె పలుచోట్ల గాలించింది. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ లింగన్న తెలిపారు. సూర్యనారాయణ రెడ్డికి సుమారు 63 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిస్తే 9490922418కి సమాచారం అందజేయాలన్నారు.